
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు 5
సోమవారం 18 ఆగస్టు 2025





పర్మిట్ రూంలతో బార్లా పడుతాయ్

- కొత్త బార్లు లాటరీ పద్ధతిన ఎంపిక
- మద్యం దుకాణాలకు పర్మిట్ రూమ్‌లు
- ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు తప్పనిసరి
- లబోదిబోమంటున్న బార్ల యాజమాన్యాలు
- సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి కొత్త బార్ పాలసీ అమలు

సెప్టెంబరు 1వ తేదీ నుంచి ప్రభుత్వం నూతన బార్ పాలసీ అమలులోకి తీసుకురానుంది. బార్ పాలసీలో ప్రతిబార్‌కు నాలుగు దరఖాస్తులు ఉంటేనే లాటరీ అనే నిబంధన ఉంది. ఒక్కో దరఖాస్తుదారుడి నుంచి రూ.5లక్షల చొప్పున రూ. 120 కోట్లు ఫీజు రూపంలో వసూలుకు సిద్ధమైంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో బార్ల వ్యాపారం జోరుగా సాగింది. ప్రభుత్వ మద్యం షాపుల్లో నాసిరకం మద్యం అమ్మడంతో మద్యపాన ప్రియులు బార్లపై ఆసక్తి చూపేవారు. కూటమి ప్రభుత్వ రాకతో మద్యం షాపుల స్థానంలో ప్రైవేట్ దుకాణాలను ఏర్పాటుచేసి లైసెన్స్‌దారులకు అమ్మకాల బాధ్యతను అప్పగించి నాణ్యమైన బ్రాండ్‌లను వినియోగంలోకి తెచ్చింది. దీంతో బార్లు పడకేశాయి. మద్యం దుకాణాల వద్ద మందుబాబులకు తాగేందుకు పర్మిట్ రూమ్‌లకు అనుమతులిస్తే తాము వ్యాపారాలు ఎలా చేసేందంటూ బార్ల యజమానులు గగ్గోలు పెడుతున్నారు.

కర్నూలు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలకు పర్మిట్‌రూమ్‌ల అనుమతితో బార్ల యాజమాన్యాలు లబోదిబోమంటున్నాయి. పర్మిట్‌లు ఇవ్వడమంటే బార్లకు పరోక్షంగా చెక్ పెట్టడమేనని వాపోతున్నారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి నూతన బార్ పాలసీ అమలులోకి తీసుకురానుంది. బార్ పాలసీలో ప్రతిబార్‌కు నాలుగు దరఖాస్తులు ఉంటేనే లాటరీ అనే నిబంధన ఉంది. ఒక్కో దరఖాస్తుదారుడి నుంచి రూ.5లక్షల చొప్పున రూ.120 కోట్లు ఫీజు రూపంలో వసూలుకు సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యం అందించే పేరుతో బార్లకు ఎన్నడూ లేని విధంగా భారం మోపబోతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాలవద్ద మందుబాబులకు తాగేందుకు పర్మిట్ రూమ్‌లకు అనుమతులిస్తే తాము వ్యాపారాలు ఎలా చేసేందంటూ గగ్గోలు పెడుతున్నారు. మద్యం దుకాణాల యాజమాన్యాలు కూడా పర్మిట్‌రూమ్‌ల పేరుతో అదనంగా రూ.7.50లక్షలు పెంచి వసూలు చేసేందుకు ఆదేశాలు జారీ చేయడంపై లాటరీ ప్రక్రియలో దుకాణాలు దక్కించుకున్న యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి.



బార్ల లైసెన్సులు ఈనెలాఖరుకు..

జిల్లాలో ప్రస్తుతం నడుస్తున్న బార్ల లైసెన్స్‌లు ఈనెలాఖరుకు ముగియనున్నాయి. సెప్టెంబరు 1వ తేదీ నుంచి కొత్త బార్లు రానున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో బార్ల వ్యాపారం జోరుగా సాగింది. ప్రభుత్వం మద్యం షాపుల్లో నాసిరకం మద్యం అమ్మడంతో మద్యపాన ప్రియులు బార్లపై ఆసక్తి చూపేవారు. ఫలితంగా వాటి అమ్మకాలు తగ్గి ప్రతి బార్‌లోనూ రోజు వారీ విక్రయాలు సగటున రూ.3లక్షల వరకు జరిగేవి. కూటమి ప్రభుత్వ రాకతో ప్రభుత్వ మద్యం షాపుల స్థానంలో ప్రైవేట్ దుకాణాలను ఏర్పాటుచేసి లైసెన్స్‌దారులకు అమ్మకాల బాధ్యతను అప్పగించారు. నాణ్యమైన బ్రాండ్‌లను వినియోగంలోకి తెచ్చింది. బార్లు పడకేశాయి.. జిల్లాలో రోజువారి విక్రయాలు సగటున లక్ష రూపాయలకు పడిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించే కొత్త మార్గదర్శకాల కోసం బార్ల యాజమాన్యాలు ఎదురు చూస్తున్నాయి.

లాటరీ ద్వారా ఎంపిక..

గతంలో వేలం పాట ద్వారా బార్లను కేటాయించేవారు. యాజమాన్యాలు సిండికేట్‌గా లైసెన్స్‌లు దక్కించుకునే వారు. ఈసారి ప్రభుత్వం లాటరీ పద్ధతిలో లైసెన్స్‌లు మంజూరు చేస్తారు. బార్లలో ధరలు అధికంగా ఉంటాయి. అధికంగా విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. మరోవైపు ఎంఆర్‌పీ ధరకే బార్‌లకు మద్యం సరఫరా చేస్తారు. ప్రైవేట్ మద్యం దుకాణాలుకు ఎంఆర్‌పీ ధరలోనే కమీషన్ తగ్గించి కేటాయిస్తారు. అందుకే ఎంఆర్‌పీ ధరలకే షాపుల్లో విక్రయాలంటూ ప్రభుత్వం స్పష్టం చేసింది. 20 శాతం కమీషన్ ఇవ్వడం లేదంటూ లైసెన్స్‌దారులు గగ్గోలు పెడుతున్నారు. ఒకటి రెండు బ్రాండ్‌లపై రూ.10 అధికంగా విక్రయించాలని ప్రయత్నాలు చేసినా ఎన్‌ఫోర్సు మెంట్ శాఖ కేసులు నమోదు చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే కేసులు నమోదు చేశారు.

బహిరంగ మద్యపానం నిరోధించేందుకు..

బహిరంగ మద్యపానం నిరోధించేందుకు మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూంలకు లైసెన్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించింది. నవంబర్ నుంచి మద్యం షాపులు మినీ బార్లుగా మారనున్నాయి. అదే క్రమంలో వైన్‌షాప్‌ల కంటే బార్లకే సరఫరా చేసే మద్యం ధర అధికంగా ఉంటుంది. నిర్వాహకులు ఎమ్మార్పీతో సంబంధం లేకుండా విక్రయించుకోవచ్చు. ఈ అవకాశాన్ని ఆసరా చేసుకుని ఇప్ప టివరకు ఇష్టానుసారంగా మద్యం అమ్మకాలు చేశారు. రానున్న రోజుల్లో మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నందున ఆ ప్రభావం బార్లపై పడనుంది. దీంతో బార్ల నిర్వాహకులకు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఎక్సైజ్ శాఖకు ఆదాయం..

జిల్లాలో 27బార్లు ఉన్నాయి. ఒక్కోదానికి కనీసం నాలుగు దరఖాస్తుల చొప్పున మొత్తం బార్లకు 108 రఖాస్తులకు రూ.5.40 కోట్ల ఆదాయం సమకూరుతుంది. లైసెన్సు ఫీజు ద్వారా ఏడాదికి రూ.120 కోట్ల ఆదాయం రానుంది. మద్యం విక్రయాల ద్వారా వచ్చేది అదనంగా ఉంటుంది.



ఎస్టీ హోదా దక్కించుకుందాం

- వాల్మీకులు ఉద్యమాలకు సిద్ధం కావాలి
- ఆదోనిలో రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలు అర్పించైనా ఎస్టీ హోదా దక్కించుకుందామని వాల్మీకి సంఘం నాయకులు ముక్తకంఠంతో తీర్మానించారు. ఆదివారం ఆదోని పట్టణంలోని జేబీ గార్డెన్‌లో ఎస్టీ సాధనే ధ్యేయంగా జిల్లా నలుమూలల నుంచి వాల్మీకి నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక ప్రముఖులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యే పార్థసారథి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో తీర్మానం చేసి వాల్మీకులను ఎస్టీలలో చేర్చాలని కేంద్రానికి పంపిందన్నారు. కానీ 2019లో టీడీపీ ఓటమి పాలవడంతో ఆ ప్రయత్నం ఆగిపోయిందన్నారు. ఇప్పుడు అందరూ కలిసికట్టుగా పోరాడితే కచ్చితంగా చంద్రబాబునాయుడు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ హక్కు సాధన కోసం ఏ స్థాయిలోనైనా పోరాటం చేస్తామన్నారు. 2019 ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్రమోదీ కర్నూలులో జరిగిన బహిరంగ సభలో వాల్మీకి బోయలను ఎస్టీలలో చేర్చుతానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ అది అమలుకాకపోవడం బాధాకరమన్నారు. కప్పట్రాళ్ల బొజ్జమ్మ మాట్లాడుతూ బోయలకు మంచి జరగాలంటే రిజర్వేషన్ తప్ప మరో మార్గం లేదన్నారు. గ్రామీణ స్థాయి నుంచి విద్యార్థులు, రైతులు, మహిళలు అందరూ ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. సమాజం మొత్తం ఒక్కటై పోరాడితేనే ప్రభుత్వం దిగివచ్చి ఎస్టీ హోదా ఇస్తుందన్నారు. టీడీపీ నాయకురాలు గుడిసె ఆదికృష్ణమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో వాల్మీకులకు అన్యాయం జరిగితే సమష్టిగా పోరాడాలన్నారు. ఈ సమావేశంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, ఆదోని ఎంపీపీ పంపాపతి, నాయకులు మంత్రాలయం రామకృష్ణారెడ్డి, కౌతాళం సురేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ రాంభీంనాయుడు, గోనెగండ్ల ప్రభాకర్‌నాయుడు, ఎమ్మిగనూరు మాజీ ఎంపీపీ శంకరయ్య, ఈఎంబీ లక్ష్మన్న, బీఎల్ నారాయణ, యపిలయ్య తదితరులు హాజరయ్యారు.

రాఘవేంద్రుని సన్నిధిలో జిల్లా న్యాయాధికారి



మంచాలమ్మకు పూజలు చేస్తున్న కర్నూలు జిల్లా న్యాయాధికారి

మంత్రాలయం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని కర్నూలు జిల్లా న్యాయాధికారి కబర్డీ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. స్వామిదర్శనార్థం వచ్చిన న్యాయాధికారిని మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, సురేష్ కోనాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాంక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట అనంతపురాణిక్, ఎస్‌ఐ శివాంజల్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్ తదితరులు ఉన్నారు.

మూడు రోజుల్లో 25,250 మంది ప్రయాణం

- స్త్రీశక్తికి పెరుగుతున్న ఆదరణ
- ప్రభుత్వంపై ఏడాదికి ఉచిత బస్ రూపంలో రూ.45 కోట్లకు పైగా భారం

కర్నూలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పేరిట ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఉచిత బస్సు ప్రయాణం సూపర్ సక్సెస్ అవుతోంది. మహిళల నుంచి ఆదరణ రోజు రోజుకు పెరుగుతోంది. ఇన్నాళ్లు చార్జీల రూపంలో ఎంత ఖర్చు చేశాం.. ఫ్రీ బస్ వల్ల ఎంత ఆదా అవుతుంది..! బేరీజు వేసుకుంటున్న మహిళల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని రూట్లలోనూ రైట్.. రైట్ అంటూ మహిళలు సందడి చేస్తున్నారు. కౌతాలం మండలం ఉరుకుంద ఈరన్నస్వామి శ్రావణమాసం ఉత్సవాలు సోమవారంతో పూర్తి కావడంతో ఉరుకుంద క్షేత్రానికి చేరుకోవడానికి ఆదివారం ఎమ్మిగనూరు, ఆదోని ఆర్టీసీ బస్టాండ్లలో మహిళలు రద్దీ కనిపించింది. ఫ్రీబస్ సౌకర్యాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 15న స్త్రీశక్తి పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. కర్నూలు-1, 2, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ ఆర్టీసీ డిపోల పరిధిలో వివిధ రూట్లలో తొలి రోజు శుక్రవారం దాదాపుగా 2,500 మంది మహిళలు సద్వినియోగం చేసుకున్నారు. రెండో రోజు శనివారం ఏకంగా 20,300 మంది మహిళలు వివిధ రూట్లలో ఉచిత బస్సు ప్రయాణం చేశారు. మూడు రోజుల సెలవులు పూర్తి కావడం వల్ల ఆదివారం 25,250 మంది ప్రయాణించినట్లు అధికారిక సమాచారం. స్త్రీశక్తి పథకం ప్రారంభానికి ముందు వరకు రోజుకు సరాసరి రూ.60 లక్షలకు పైగా చార్జీల రూపంలో ఆర్టీసీకి ఆదాయం వచ్చేంది. ఫ్రీ బస్ సౌకర్యం వల్ల దాదాపు రూ.12-13 లక్షల వరకు రాబడి తగ్గింది. ఈ మొత్తాన్ని రాయితీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. అంటే ఒక్క కర్నూలు జిల్లా నుంచి నెలకు రూ.3.60-4 కోట్లు.. ఏడాదికి రూ.45-48 కోట్లకు పైగా ఫ్రీ బస్ రూపంలో సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం రాయితీ బరించాల్సిందే. ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు ఆర్టీసీ బస్టాండ్లను ఆ సంస్థ ఆర్ఎం టి.శ్రీనివాసులు పరిశీలించారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం సద్వినియోగంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్లు, కండక్టర్లకు సూచనలు చేశారు.



ఎమ్మిగనూరు బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఆర్ఎం టి.శ్రీనివాసులు

మూడు రోజుల్లో ఉచిత బస్సు ప్రయాణం చేసిన మహిళలు

ఏపీఎస్ ఆర్టీసీ డిపో	15న	16న	17న
కర్నూలు - 1	350	3,150	3,500
కర్నూలు - 2	650	6000	6,750
ఆదోని	600	4,250	5,750
ఎమ్మిగనూరు	550	4,350	5,750
పత్తికొండ	350	2,550	3,500
మొత్తం	2,500	20,300	25,250

సెల్‌ఫోన్లలో గుర్తింపు కార్డులు చూపించినా ఓకే

స్త్రీశక్తి పథకం ప్రారంభించి రెండు రోజులు అవుతోంది. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నుంచి మళ్లీ ఉత్తర్వులు వచ్చే వరకు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపు కార్డు.. వంటి గుర్తింపు కార్డులు సెల్‌ఫోన్లో చూపించినా అనుమతిస్తారు. ఈమేరకు కండక్టర్లకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఏ ఒక్కరు కూడా ఇబ్బంది పడకుండా ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలి.

- టి.శ్రీనివాసులు, రీజినల్ మేనేజరు, ఏపీఎస్ ఆర్టీసీ, కర్నూలు

ప్రధాన రహదారి బురదమయం

ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు

సి.బెళగల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ బురదమయ్యాయి. సి.బెళగల్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. వాటిలో వర్షపు నీరు చేరి రహదారులన్నీ బురదగుంటలుగా దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలో ఆర్ఎంబీ రోడ్డులో ఎమ్మిగనూరు నుంచి సి.బెళగల్‌కు వస్తున్న ఓ ఆర్టీసీ బస్సు బురద గుంటలో ఉన్నట్టుండి ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు అదే బురదలో దిగి అవస్థలు పడ్డారు. స్థానికులు, ప్రయాణికులు కలసి ఆర్టీసీ బస్సును అతి కష్టంపై ముందుకు తోశారు. దాదాపు అరగంట తర్వాత బస్సు కదిలింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న ప్రధాన రహదారిపైనే ఇంత అధ్వానంగా రహదారులు ఉంటే మరి గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఏవిధంగా ఉందో అంటూ ప్రయాణికులు, ప్రజలు చర్చించుకున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవచూపి రహదారులను బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రోడ్డులో ఇరుకున్న బస్సును తోస్తున్న ప్రయాణికులు

కిక్కిరిసిన మల్లన్న క్షేత్రం

- సెలవు రోజులు కావడంతో భక్తుల రద్దీ



దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు

శ్రీశైలం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగం, శక్తిపీఠమైన శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన యాత్రికులు తెల్లవారుజాము నుంచి క్యూలైన్లలో బారులుదీరారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి తర్వాత స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న కారణంగా స్వామి, అమ్మవార్ల దర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. భక్తుల శివనామ స్మరణతో శ్రీగిరులు మార్మోగాయి. ఆలయ దర్శనాలు ప్రారంభమై ముగిసేంత వరకు ఉచిత ప్రసాద వితరణ, తాగునీటి సౌకర్యం ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

- ఆదోనిలో రైతుల విజయోత్సవ ర్యాలీ
- హాజరైన కూటమి నాయకులు

7

డీఈవో విద్యార్హతలపై విచారణకు కమిషనర్ ఆదేశం

కర్నూలు డీఈవో విద్యార్హతలపై విచారణకు కమిషనర్ ఆదేశం

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు విద్యాశాఖ అధికారిగా పని పనిచేస్తున్న శామ్యూల్ పాల్ బీఈడీ విద్యార్హత పొందిన విధానంపై సమగ్ర విచారణ చేసి నివేదిక అందజేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు కడప పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకుడిని ఆదేశించారు. ఈ మేరకు విడుదలైన ప్రొసీడింగ్స్‌ను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రధాన కార్యదర్శి ఎన్.శేషఫణిరాజు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా పదోన్నతులకు అర్హులైన అసిస్టెంట్ డైరెక్టర్ల సీనియారిటీ జాబితాలో డీఈవో శామ్యూల్ పాల్‌కు బీఈడీ అర్హత లేదని ఆయన పేర్కొన్నారు అధికారికంగా స్వయంగా సంతకం చేసిన ఉత్తర్వులో కూడా శామ్యూల్ పాల్ తన విద్యార్హత కేవలం బీఏగానే పేర్కొన్నారన్నారు. 24.10.2024న ప్రభుత్వం జారీ చేసిన జీవోఆర్‌టీ.నెం.433 ద్వారా బీఈడీ విద్యార్హతతో కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారిగా పదోన్నతి పొందడంపై వివిధ ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆందోళనలు చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ గౌరవ ప్రతిష్ఠలు దెబ్బతినకుండా ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని కోరడంతో అందుకు స్పందించి విచారణకు ఆదేశించినట్లు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ జనరల్ సెక్రటరీ శేషఫణిరాజు తెలిపారు. పాఠశాలల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డీఈవో శామ్యూల్ పాల్‌పై తక్షణమే వచ్చిన ఆరోపణలపై సమగ్రంగా నిష్పక్షపాతంగా విచారణ చేసి వాస్తవాలను బహిర్గతం చేసి జిల్లా విద్యాశాఖ గౌరవ ప్రతిష్ఠలు కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యాగంటీశ్వరుడిని దర్శించుకున్న కర్నూలు జేసీ

బనగానపల్లె, ఆగస్టు, 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రాన్ని కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టరు నవ్య ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, మౌళీశ్వరరెడ్డి, పూజారులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టరు నవ్య ఆలయంలోని నందీశ్వరున్ని, ఉమామహేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు చేశారు. జేసీ నవ్యకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు.



తీర్థ ప్రసాదాలను అందుకుంటున్న కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టరు నవ్య

చిన్నారిని కాపాడిన ఉద్యోగులు

మహానంది, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ చిన్నారిని స్థానిక ఆలయ ఉద్యోగులు, పోలీసులు కాపాడారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన ఓ కుటుంబం కారులో మహానంది క్షేత్రానికి దర్శనం కోసం వచ్చారు. ఆలయం సమీపంలోని రాతి నంది సర్కిల్ వద్ద కారును నిలిపి తమ ఏడాది వయస్సున్న చిన్నారిని అందులో ఉంచి కారుకు తాళం వేసి దర్శనానికి వెళ్లారు. కారులో ఉన్న ఆ చిన్నారి ఊపిరి ఆడక చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండగా గుర్తించిన ఆలయ ఉగ్యోగి ఈశ్వర్, కానిస్టేబుల్ చంద్రశేఖర్‌తో పాటు మరో ఆలయ ఉద్యోగి నాగార్జునరెడ్డి కలిసి కారు అద్దాలు పగలకొట్టి ఆ చిన్నారిని ప్రాణా పాయం నుంచి రక్షించారు. అనంతరం ఆ చిన్నారిని తల్లితండ్రులకు అప్పగించారు. చిన్నారిని కాపాడిన ఉద్యోగులను పలువురు అభినందించారు.




చిన్నారి తల్లితండ్రులతో ఉద్యోగులు

అడవి పందుల దాడిలో మొక్కజొన్న ధ్వంసం

కొత్తపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. దీంతో తమకు నష్టపరిహారం చెల్లించాలని మండలంలోని గుమ్మడాపురం రైతులు అటవీ శాఖ అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు బొల్లు నాగశేషన్న, బొల్లు శ్రీనివాసులు, బి.నాగశేషన్న, శ్రీరాములు, హరిక్రిష్ణ, చెంచన్న, లింగన్న ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తమ గ్రామానికి సమీపంలో నల్లమల అడవి ఉండటంతో శనివారం రాత్రి అడవి పందులు గుంపులు గుంపులుగా వచ్చి మొక్కజొన్న పంటలను నాశనం చేశాయన్నారు. దీంతో తీవ్రంగా నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం అటవీ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సుమారు 20 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతులు వారికి వివరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తమకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు విన్నవించారు.



ధ్వంసమైన మొక్కజొన్నను అటవీ సిబ్బందికి చూపిస్తున్న రైతులు



ప్రకృతి ఒడిలో కృష్ణమ్మ పయనం

శ్రీశైలంలో ఉధృతంగా ఉప్పొంగే నీటి ప్రవాహమే కాదు.. చుట్టుపక్కల ప్రకృతి అందాలను కలుపుకొని ప్రవహించే కృష్ణా జలాల సోయగం ఎంతటివారినైనా ఇట్టే కట్టిపడేస్తుంది. రాయలసీమ రైతుల గుండెచప్పుడుగా ఉండే శ్రీశైలం జలాశయం పరిసర ప్రాంతాలన్నీ ప్రకృతి ప్రసాదించిన అపురూప దృశ్యాలు. డ్యాం గేట్ల ముందువైపు భారీ శబ్దంతో గంభీరంగా కనిపిస్తుండగా... డ్యాంపై భాగంలో ప్రశాంతంగా నిద్రిస్తున్నట్లు ఉండేలా కృష్ణమ్మ కనిపిస్తుంది. పచ్చదనం విచ్చుకున్న శ్రీశైలం జలాశయం పరిసరాలను వీక్షించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు.

- నంద్యాల (ఆంధ్రజ్యోతి)

'హ్యూమన్ సోర్స్ యాప్'లోకి వర్సిటీల డేటా..!



- బోధన, బోధనేతర, నిధులు, వ్యయాలపై ఆరా
- కాంకరెన్స్ లేని నియామకాలపై సందిగ్ధత
- వివరాలు సేకరిస్తున్న మాట వాస్తవమే : ఆర్‌యూ వీసీ

కర్నూలు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'హ్యూమన్‌సోర్స్ యాప్' పేరుతో వర్సిటీల డేటాపై ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. విద్యార్థులకు ఉన్నత విద్య కీలకం కావడంతో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. కాంకరెన్స్ (ప్రభుత్వ అనుమతి) లేని నియామకాలపై తర్జన.. భర్జనలో ఉన్నట్లు సమాచారం. ఆ క్రమంలో జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీల పాలన, బోధనపై వివరాలను ఉన్నత విద్యామండలి (యాప్సి) సేకరిస్తోంది. బోధన, బోధనేతర ఉద్యోగులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అప్ లోడ్ చేసేందుకు ఆదేశించింది. ప్రతి ఏటా నిధిపోర్టల్ యాప్‌లో జరిగే ప్రక్రియ అయినప్పటికి ఈ ఏడాది పక్కగా మరో యాప్‌లో కూడా వివరాలు పొందుపరచాలని ఉన్నత విద్యా ఆదేశించిందని వర్సిటీల అధికారులు చెబుతున్నారు. ఉద్యోగుల జీత, భత్యాల పంపిణీలో సీఎఫ్‌ఎంఎస్ డేటాకు సంబంధించిన సమస్యలకు చెక్ పెట్టేందుకు ఈ ప్రక్రియను తెరపైకి తెచ్చారని తెలిసింది. జిల్లాలోని ఓ వర్సిటీకి సంబంధించి వివరాల్లో ఏళ్ల తరబడి సమస్యల పరిష్కారం కాకపోవడంతో పాటు పలు అవకతవకలు జరిగాయి. వాటిని తిరస్కరించడంతో పక్కగా వాటి వివరాలు పొందు పరిచేందుకు వర్సిటీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఇటీవల జరిగిన పాలక మండలిలో బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించిన సమస్యాత్మక విషయాలపై ఉన్నతాధికారులతో చర్చించినట్లు సమాచారం. ఆ దిశగా వివరాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఆదేశించడంతో ఆన్‌లైన్‌లో ప్రతి అంశం చేర్చడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలు ప్రస్తుతం యాప్ అప్‌లోడ్ ప్రక్రియలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

వివరాలు సేకరిస్తున్న మాట వాస్తవమే

వివరాలను సేకరిస్తున్న మాట వాస్తవమే. గత పాలనలో కొన్ని నియామకాలకు సంబంధించిన ప్రక్రియలో కాంకరెన్స్ లేకుండా నియామకాలు జరిగాయి. ఫలితంగా సీఎఫ్‌ఎంఎస్ డేటాలో సమస్యలు ఇబ్బందికరంగా తయారయ్యాయి. వాటన్నింటిని సక్రమంగా గాడిలో పెట్టేందుకు ఉన్నత విద్యామండలి ప్రతి చొరవ తీసుకుంటోంది. హ్యూమన్‌రీసోర్స్ యాప్ ద్వారా వివరాలను సేకరిస్తోంది.

- షాషావలి ఖాన్, ఉపకులపతి, డాక్టర్ అబ్దుల్ హక్ వర్సిటీ

ఆర్థిక లావాదేవీలు సైతం..

వర్సిటీలకు సంబంధించిన ప్రతి అంశం ఇకపై ఉన్నత విద్యా మండలి పర్యవేక్షణలో జరిగేందుకు ప్రభుత్వం కసరత్తు చేపడుతోంది. వ్యయం, నిధులతో పాటు వర్సిటీ క్యాంపస్‌లోని ప్రతి ఒక అంశానికి వివరాలను సేకరించే దిశగా ఓ వెబ్ పోర్టల్‌ను వర్సిటీలకు పంపింది. వసతి గృహాలు, విద్యార్థుల తరగతి గదులు, ప్రతి ఆర్థిక లావాదేవీలు ఉన్నత విద్యాపర్యవేక్షణకు ఆన్‌లైన్‌విధానం తెరపైకి తెచ్చారు. గతంలో నియామకాలకు సంబంధించి ఉన్నత విద్యా మండలి అనుమతులు లేకుండా నియామకాలు జరగడం వల్లే సీఎంఎస్‌ఎఫ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల పలువురు ఉద్యోగులకు వేతనాలు నిలిచిపోయాయి. దీంతో ఆ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

రైతు బలవన్మరణం

పంటలు పండక, అప్పులు తీర్చలేక ఉరి

నందవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పంటలు పండక.. అప్పులు అధికమై ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన నందవరం మండలంలోని హలహర్వి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హలహర్వి గ్రామానికి చెందిన రైతు రాజు(27)కు అదే గ్రామానికి చెందిన మహాదేవితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉండగా, ప్రస్తుతం ఆమె 8 నెలల గర్భవతి. రాజు భార్యతో కలసి కూలీ పనులు చేసుకుంటూ గ్రామంలోనే 3 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేసేవాడు. ఐదేళ్లుగా మిరప, పత్తి పంటలను సాగు చేశాడు. అయితే ప్రకృతి కరుణించకపోవడంతో మిరప పంటకు తెగుళ్ల సోకి దిగుబడులు రాలేదు. ఈ పంటల కోసం వివిధ చోట్ల రూ.6లక్షలకు పైగా అప్పులు చేశాడు. పంటలు చేతికందకపోగా అప్పులకు వడ్డీలు అధికమయ్యాయి. ఈ క్రమంలో రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో నిత్యం రాజు మదనపడేవాడు. ఇటీవల భార్య మహాదేవి ప్రసవానికి పుట్టింటికి వెళ్లింది. అప్పులు ఎలా తీర్చడం లేదంటూ శనివారం రాత్రి భార్య ఇంటికి వెళ్లి రాజు ఆవేదన వ్యక్తం చేశాడు. తనతో పాటు ఇంటికి రావాలని భార్యను పిలవగా, ఈ పరిస్థితుల్లో తాను రాలేనని ఆమె చెప్పింది. సరేనని అక్కడి నుంచి వెళ్లిన రాజు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం 8 గంటలైనా తలుపులు తెరవకపోవడంతో రాజు చిన్నమ్మ ఉలిగమ్మ వెళ్లి చూసింది. భర్త మరణవార్త తెలుసుకున్న మహాదేవి అక్కడకు చేరుకుని రోదించిన తీరు కలచివేసింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కొదండరామిరెడ్డి తెలిపారు.



రాజు(ఫైల్)

నేడు నగర పాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుం దన్నారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటార న్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీలో ఏదైనా స్థానిక సమస్యలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం



విజయోత్సవ ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

- ఆదోనిలో రైతుల విజయోత్సవ ర్యాలీ
- హాజరైన కూటమి నాయకులు

ఆదోని, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని, సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా చంద్రన్న పాలన కొనసాగుతోందని కూటమి నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం నిధులను మంజూరు చేయడంతో ఆదివారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో 350కి పైగా రైతులు ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి భీమాస్ సర్కిల్ వరకు ట్రాక్టర్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మాట్లాడుతూ ఎన్నికల హామీ నిలబెట్టుకుని అన్నదాత సుఖీభవ పథకం కింద తొలివిడతగా రూ.7 వేలు చొప్పున జమ చేసిన సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలు దగాకు గురయ్యారన్నారు. గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఎరువుల వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, టీడీపీ అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి, నాయకులు గుడిసె కృష్ణమ్మ, బసాపురం రామస్వామి, భూపాల్‌చౌదరి, మారుతినాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, బీజేపీ నాయకులు ఉపేంద్ర, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పార్థసారథితో కరచాలనం చేస్తున్న మీనాక్షినాయుడు

వ్యవసాయానికే ప్రాధాన్యం : ఎమ్మెల్సీ బీటీ నాయుడు

విత్తనాల పంపిణీ నుంచి ఎరువులు, సాగునీరు తదితర విషయాల్లో రైతులకు మేలు చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వ్యవసాయానికే ప్రాధాన్యం ఇస్తూ చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. రైతులను అన్నివిధాలుగా ఆదుకోవడం కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పరిపాలన సాగిస్తున్నారు. పొలంలో విత్తనాలు చల్లడం, పంటలకు ఎరువులు వేయడం, పురుగు నివారణ మందులు పిచికారి చేయడం కోసం రైతులకు రాయితీపై తమ ప్రభుత్వం డ్రోన్లు అందిస్తోంది.

హామీలన్నీ అమలు చేస్తున్నాం : ఎమ్మెల్యే పార్థసారథి

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. రైతులకు లబ్ధి చేకూర్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిబద్ధతతో పనిచేస్తున్నాయి. ఈనెల ఆగస్టు 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చి ఇచ్చిన హామీని నెరవేర్చాం.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు స్పష్టమైన హామీనిచ్చారు. ఆదివారం నగరంలోని వెంకటరమణ కాలనీలో కీర్తన అనాథ శరణాలయంలో ఏపీయూడబ్ల్యూజే 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తదితరులు హాజరయ్యారు. ముందుగా యూనియన్ నాయకులు పతాకాన్ని ఎగురవేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి మాట్లాడుతూ జర్నలిస్టుల డిమాండ్లను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ యూనియన్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. చిన్నారులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, ఐజేయూ సభ్యుడు నాగరాజు, యూనియన్ నాయకులు ఎన్వీ సుబ్బయ్య, శ్రీనివాసగౌడ్, శివరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలూరులో జరిగిన వేడుకల్లో డీఈఓ శామ్యుల్‌పాల్ పాల్గొన్నారు. అదేవిధంగా మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, గూడురు, నంద్యాల పట్టణాల్లో ఆవిర్భావ వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

భారతీయ సాహిత్యంలో తెలుగు కథలు వైవిధ్యం

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్

కర్నూలు కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ సాహిత్యంలో తెలుగు కథలు వైవిధ్యమైన పాత్ర పోషిస్తున్నాయని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కేంద్ర సాహిత్య అకాడమీ, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో '75 ఏళ్ల తెలుగు చిన్న కథలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెంగార మోహన్ మాట్లాడుతూ 1947 నుంచి 2022 వరకు తెలుగు కథలలో అనేక మార్పులు, పరిణామాలు వచ్చాయన్నారు. సమాజాన్ని తీవ్ర ప్రభావితం చేశాయని గుర్తు చేశారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ సాహిత్య అకాడమీ దేశవ్యాప్తంగా భాషా సాహిత్యాలకు వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. అకాడమీ తొలి అధ్యక్షులుగా నెహ్రూ పనిచేశారని సభకు తెలియజేశారు. ఈ సదస్సులో ప్రగతిశీల విప్లవ కథలు అనే అంశంపై విరసం నేత నాగేశ్వరాచారి, మైనారిటీ, స్త్రీవాద కథలపై ఎస్ ఎండీ ఇనాయతుల్లా, దళిత, బహుజన, గిరిజన కథలు అనే అంశంపై జి.వెంకటకృష్ణ, ప్రాంతీయ కథలు అనే అంశంపై పౌరోహితం మారుతి ప్రసంగించారు. సదస్సును సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి ప్రారంభించగా, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు సదస్సు లక్ష్యాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కెంగార మోహన్

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

మహానంది/నంద్యాల టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గుంటూరు- గుంతకల్లు మార్గంలోని గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై సుమారు 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం ఉదయం గుర్తించినట్లు నంద్యాల రైల్వే ఎస్ఐ కుమారి తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. ఆ వ్యక్తి నల్లటి టీషర్ట్, టవల్ ధరించి ఉన్నట్లు తెలిపారు. పొరపాటున రైలు నుంచి పడి మృతి చెందాడా.. లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే కోణంలో విచారిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పర్సంటేజీల కోసమే!

● సుందరీకరణ పేరుతో డివైడర్ల తొలగింపు
● చేసిన పనులు చేస్తూ ప్రజాధనం వృధా
● పన్నులు ప్రభుత్వానికి.. కష్టాలు ప్రజలకు?

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):

నగరాన్ని సుందరీకరణ పేరుతో ప్రజాధనాన్ని నగరపాలక అధికారులు దుర్వినియోగం చేస్తున్నారు. కొందరి మెప్పు కోసమే సుందరీకరణ పనులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన డివైడర్లను తొలగించడంతో పాటు వాటి స్థానంలో పచ్చదనం పెంచేందుకు డివైడర్ల మధ్యలో మొక్కలు నాటుతామని...అది కూడా ఆక్సిజన్ ఇచ్చే మొక్కలు కాకుండా ఎందుకూ పనికిరాని మొక్కలను నగర పాలక అధికారులు నాటేందుకు సిద్ధమయ్యారు. ఎన్‌క్యాప్ నిధులతో డివైడర్లను తొలగించి వాటి స్థానంలో పచ్చదనం పెంచేందుకు అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు అందరూ ఏకమయ్యారు. దీని కోసం రూ.1.20 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

● ఎవరి కోసం....

నగర పాలక కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్ల మధ్యలో ఉంచిన తెలుగు అక్షరాల స్తంభాలను తీసేసి, వాటి స్థానంలో మళ్లీ డివైడర్లు ఏర్పాటు చేశారు. డివైడర్ల మధ్యలో మొక్కలు నాటి నగరాన్ని గ్రీన్ అండ్ క్లీన్ సిటీగా మార్చి స్వచ్ఛ సర్వేక్షన్‌లో మంచిర్యాంకును సాధించాలనే తపనతో పనులు చేస్తున్నారు. చేసిన పనులు మళ్లీ చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు ఎవరి మెప్పు కోసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఓ ప్రజాప్రతినిధి తన క్యాంపు కార్యాలయం నుంచి ఇంటికి వెళ్లే దారి అందంగా కల్పించాలనే ఉద్దేశంతో డీవీఆర్ హోటల్ నుంచి చిరంజీవి పార్కు వరకు ఉన్న


డివైడర్లను నిర్మిస్తున్న దృశ్యం

డివైడర్లను తొలగించి పచ్చదనం పెంపునకు రూ.70 లక్షలు ఖర్చుచేస్తున్నారు. అలాగే బంగారు పేట నుంచి ఐదు రోడ్ల కూడలి వరకు ఉన్న డివైడర్లను తొలగించి అదే పచ్చదనం పెంపుకోసం రూ.50 లక్షలు ఖర్చుచేస్తున్నారు.

● పర్సంటేజీల కోసమే..

నగర పాలకలోని కొందరు అధికారులు ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై కాంట్రాక్టర్ల నుంచి పర్సంటేజీలు తీసుకోవడానికే ఈ పనులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అయితే ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులకు పర్సంటేజీలు ముట్టచెప్పకుంటే కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం లేదనే వాదన వినిపిస్తోంది. శివారు కాలనీల్లో కనీసం నడిచేందుకు కంకర రోడ్లు లేవని, మురుగు కాల్వలు లేక రోడ్లపై వర్షం పడితే నీరు నిలిచి ఇంటికి వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నామని స్థానికులు పలుమార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంతో పాటు తమ ఎమ్మెల్యేల దృష్టికి తీసుకొస్తున్నారు. అలాంటి వాటిపై దృష్టి పెట్టకుండా మంచిగా ఉన్న రోడ్లను పగులగొట్టడం, డివైడర్లు వేయడం లాంటివి చేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


ఎన్‌ఆర్‌పేట వద్ద ఇలా..

● రోడ్ల విస్తరణ చేపట్టాలి..

నగరంలో రోజురోజుకి జనాభా పెరిగిపోతుంది. జనాభా తగ్గట్లుగా రోడ్లు లేవని ఇప్పటికే అధికారులు అంచనాలు వేశారు. పలుచోట్ల రోడ్ల విస్తరణ చేపట్టాలని గతంలోనే నిర్ణయించారు. అయితే అది కేవలం పేపర్ వరకు మాత్రమే సర్దుకుంది. ఇక ఆచరణ ఎప్పుడో తెలియడం లేదు. ట్రాఫిక్ పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రోడ్లను విస్తీర్ణం చేయాల్సిన అధికారులు ఉన్న రోడ్లను ఇరుకు రోడ్లుగా తయారు చేస్తున్నారు. అడుగు విస్తీర్ణంలో ఉన్న సిమెంటు దిమ్మెలను తొలగించి మూడు అడుగులకు పైగా విస్తీర్ణంతో ఆర్సీ గోడలు నిర్మించడం అవసరమా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్లు లేని శివారు ప్రాంతాల్లో రోడ్లు వేయాలని శివారు ప్రజలు కోరుతున్నారు.


రైల్వే స్టేషన్ వెళ్లే దారిలో..

● శివారు కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి

శివారు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రజాధనం అంతా చేసిన పనులకే మళ్లీ చేయడం దారుణంగా ఉంది. నగరాన్ని సుందరీకరణ చేయడములో తప్పులేదు...లేని చోట్ల చేయండి.. ఉన్న చోట్ల వదిలేయండి. ప్రతి సోమవారం శివారు కాలనీల్లో అభివృద్ధి చేపట్టాలని ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని అధికారులు, ప్రజాప్రతినిధులు అస్సలు పట్టించుకోవడం లేదు.

శ్రీహర్ష, కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు

సుందరీకరణ కోసమే చేస్తున్నాం

నగరాన్ని సుందరవనంగా తీర్చిదిద్దేందుకే డివైడర్ల స్థానంలో పచ్చదనాన్ని పెంచుతున్నాం. ఎన్‌క్యాప్ నిధులతో సుందరీకరణ పనులు నగరంలో ప్రారంభించాం. ఇప్పటికే హార్ట్ అండ్ బ్రెయిన్ ఆసుపత్రి నుంచి జొహరాపురం కిమ్స్ ఆసుపత్రి వరకు డివైడర్ల మధ్యలో మొక్కలు వేసి పచ్చదనాన్ని పెంచాం.

\- శేషసాయి, ఇన్‌చార్జి ఎస్ఈ

'జీవోను ఉపసంహరించుకోవాలి'


మాట్లాడుతున్న నంది విజయలక్ష్మి

కర్నూలు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు బయటకు రాకుండా ఉండేందుకే పాఠశాలల్లోకి ప్రజా సంఘాల ప్రవేశాన్ని నిషేధించారని, ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పాఠశాలల ఆవరణలోకి విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం రద్దు చేసుకోవాలని కోరారు. విద్యార్థుల సమస్యలు బయటకు రాకుండదనే కుట్రతోనే ప్రభుత్వం ఇలాంటి నియంతృత్వ పోకడలతో ఆదేశాలు జారీ చేసిందన్నారు. గతంలో విద్యార్థి సంఘాలను సమస్యపై పోరాడంటి అంటూ నారా లోకేశ్ ప్రోత్సహించి అధికారంలోకి వచ్చాక నియంతృత్వ ధోరణి అవలంబించం సరైన పద్ధతి కాదన్నారు. సమావేశంలో మహిళా ఐక్య వేదిక రాయలసీమ డివిజన్ అధ్యక్షురాలు ఆడిగ భారతమ్మ, జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ, జిల్లా ఉపాధ్యక్షురాలు హుస్సేన్ బీ, ఎలిశమ్మ, ఖాసింబీ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయాలి


గుంతలు పడ్డ రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ఆర్‌అండ్‌బీ, నగర పాలక రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండు వెళ్లే మెయిన్ రోడ్డు పక్కన గుంతలు పడి శిథిలావస్థకు చేరిన రోడ్లను సీపీఎం బృందం పరిశీలించారు. సీపీఎం నగర కార్యదర్శి టి. రాముడు మాట్లాడుతూ ప్రధానంగా ఆర్టీసీ బస్టాండు మెయిన్ రోడ్డు పక్కనే ఉండే లింకు రోడ్డు మధ్యలో ఉండే భాగం శిథిలమై గుంతలు పడి వాహనదారుల, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవిస్తే ఇది మా పరిధిలోకి రాదని, మున్సిపాలిటీ అధికారులే చేయాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇరు శాఖలు సమన్వయంతో గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పీఎస్.రాధాక్రిష్ణ, ఆనంద్‌బాబు, గురుశేఖర్, ప్రభాకర్, చలపతి, యేసు, రాజు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు అవార్డు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌కు మౌలానా ఆజాద్ యూత్ ఇన్స్పిరేషన్ అవార్డును శనివారం ఈ-మెయిల్ ద్వారా అందజేశారు. అవార్డు వచ్చిన సందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను అభినందించారు.

మురుగు కాలువలు నిర్మించాలి: సీపీఐ


మురుగునీరు చూపిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కల్లూరు ఏరియా వార్డులలో శరీన్‌నగర్ రోడ్డు బడి పక్కన సీసీ రోడ్లు లేక మురుగు కాలువల నుంచి నీరు బయటకు వస్తుండడంతో సమీప కాలనీ ప్రజలు రోగాల బారిన పడుతున్నారని సీపీఐ నగర సహాయ కార్యదర్శి దంభోళం శ్రీనివసారావు అన్నారు. ఆదివారం కల్లూరు వార్డులు శరీన్‌నగర్ కాలనీలో పర్యటించారు. ఆయా కాలనీలో డ్రైనేజీ కాలువలు లేక మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుందన్నారు. సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నూర్జహాన్, రబియా, జరీనాబీ, వసంతమ్మ, సులోచన, జయలక్ష్మి, లలితమ్మ, ఏస్తేరమ్మ ఉన్నారు.

'పుస్తకాలపై నిషేధం భావప్రకటనా స్వేచ్ఛకు విఘాతమే'


నగరంలోని సి.క్యాంపు సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కవులు, రచయితలు

కర్నూలు కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం ప్రసిద్ధ రచయితలు రాసిన 25 పుస్తకాలను నిషేధిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతమేనని పలువురు రచయితలు, కవులు విమర్శించారు. ఆదివారం నగరంలోని సి.క్యాంపు సెంటర్‌లో ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, టీడీఎఫ్ రాష్ట్ర నాయకుడు రత్నం ఏసేపు మాట్లాడుతూ ఈనెల 7న జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ 25 పుస్తకాలపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారని, సుప్రసిద్ధ రచయితలు అరుంధతి రాయ్, ఏపీ నూరాని, సుమంత్ర బోస్, సీమా కాజీ, డేవిడ్ దేవదాస్ వంటి వారి పాపులర్ పుస్తకాలు నిషేధిత పుస్తకాల జాబితాలో ఉన్నాయని అన్నారు. ఈ పుస్తకాన్నీ కశ్మీర్‌లో జరుగుతున్న వాస్తవ విషయాలను తెలియజేసేవేనని, వాటిని నిషేధించడం ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మేధావులపై, మేధావుల ఆలోచనలపై నిషేధం విధించినట్లు అవుతోందని చెప్పారు. కశ్మీర్ విడుదల చేసిన ఈ నిషేధిత ఉత్తర్వుల వెనుక కేంద్ర ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించారు. తక్షణమే కశ్మీర్ ప్రభుత్వం ఈ 25 పుస్తకాలపై నిషేధం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కవులు, రచయితలు కెంగార మోహన్, పౌరోహితం మారుతి, నాగేశ్వరాచారి, సయ్యద్ జహీర్ అహ్మద్, ఆవుల చక్రపాణి యాదవ్, తనగల విజయుడు, డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రవి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కల్లూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత మనందరి వ్యక్తిగత బాధ్యత అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్ అన్నారు. ఆదివారం నంద్యాల చెక్‌పోస్టులోని శ్రీకృష్ణుని ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన ప్లేట్లు, గ్లాసులు చెత్తను ఆయన స్వయంగా తొలగించారు. ప్రతిఒక్కరూ సమాజంపై బాధ్యతగా మెలగాలని సూచించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించాలి


మాట్లాడుతున్న జి.చంద్రశేఖర్

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, కళాశాలలో పని చేసి పదవి విరమణ పొందిన ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న సంపాదిత సెలవుల ఆరియర్స్, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, జోనల్ కోఆర్డినేటర్ రంగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బీ.క్యాంపు కల్లూరు విశ్రాంత ఉద్యోగుల పెన్షనర్స్ సేవా సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం రిలీజ్ చేసిన డీఏ 2018 నుంచి 2021 వరకు చెల్లించలేదన్నారు. రిటైర్డు అయిన ఉద్యోగులకు 2021 నుంచి అరెల్ లీవ్స్ చెల్లించలేదన్నారు. ఏపీ గురుకుల సొసైటీలో రిటైర్డు అయిన ఉద్యోగులకు అన్ని బకాయిలు చెల్లిస్తున్నారే గానీ సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల సొసైటీలో పదవి విరమణ పొందిన ఉద్యోగులకు గత 7 సంవత్సరాలుగా బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని వారు ప్రశ్నించారు. 2023లో 142 మంది రిటైర్డు ఉద్యోగులకు ఈఎల్ బిల్లులను పీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడు చేసినప్పటికీ ఆర్థిక శాఖ 2024 ఏప్రిల్ నెల వరకు ఆమోదించకపోవడంతో బడ్జెట్ లాప్స్ అయిందన్నారు. పీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడు చేసిన అన్ని బిల్లులు ఆమోదించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బాలభాస్కర్, తిరుపాలయ్య, మహారెడ్డి, వెంకటేశ్వర్లు, అబ్రహం, వాసుదేవ రెడ్డి, గంగాధర్, వీరప్రతాప్ పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ఇస్కాన్ సేవలు స్ఫూర్తిదాయకం

● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


ఇస్కాన్ టెంపుల్‌లో పూజలు చేస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంస్థ (ఇస్కాన్) ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతాయని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలోని పార్కురోడ్డులోగల ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఎక్కడ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా ఇస్కాన్ ప్రతినిధులు ముందుండి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తారని, మానవతా దృక్పథాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నారని ప్రశంసించారు. నిత్యం భగవద్గీతను ప్రజల్లో ప్రచారం చేస్తూ వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మందిర ఇన్‌చార్జి రఘునందన దాస, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో..

త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కర్నూలు, కల్లూరు కమిటీల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం నగరంలోని వెంకటరమణ కాలనీలో గల కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నగర్‌లో వేదిక నిర్మించి, స్వామివారి విగ్రహాన్ని కొలువుదీర్చి పూజాది కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం శ్రీకృష్ణ విగ్రహంతో నగరంలో ఊరేగింపు చేపట్టారు. కల్లూరు శాఖ ఆధ్వర్యంలో రేమడూరు గ్రామంలోనూ ఈ వేడుకలను కొనసాగించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కర్నూలు అధ్యక్షుడు నాగయ్య, కల్యాణ్, వాసు, రాజేశ్వరి, కృష్ణవేణి, మధువాణి, జగదీష్, వెంకటేశ్, ప్రమీల, నాగరాజు, కల్లూరు కమిటీ నిర్వాహకులు ఓబులేసు, పురుషోత్తం రెడ్డి, శేషయ్య, గంగన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సి. బెళగల్: మండలంలోని పోలకల్లు, బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, మారందొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, ముడుమాల, శింగవరం, కొత్తకోట, సిబెళగల్ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాల్లో కృష్ణుడికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆలయం ముందు ఉట్టిని యువకులు పగలగొట్టారు. సాయంత్రం కృష్ణుడి విగ్రహాలను పల్లకిలో పెట్టుకుని ఊరేగింపు చేశారు.

కేవీఆర్ పాఠశాలలో..

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేవీఆర్ గార్డెన్‌లోని కేవీఆర్ పాఠశాల విద్యార్థులు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెంకటరమణ కాలనీలో నిర్వహించిన పోటీ ల్లో స్థానిక కేవీఆర్ గార్డెన్‌లోని కేవీఆర్ పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణ జన్మా వృత్తాంతాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్యఅతిథులుగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సాధూ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణ విగ్రహం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


కృష్ణుడు, గోపికలు ఇతరుల వేషాధారణలో చిన్నారులు

మార్షల్ ఆర్ట్సతో ఉజ్వల భవిష్యత్తు


తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్సతోనే విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ తెలిపారు. ఆదివారం తన నివాసంలో జిల్లా స్థాయిలో తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులు ప్రోత్సహించడానికి తాను ఎల్లప్పుడూ ముందుటామని తెలిపారు. కర్నూలు సిటీని స్పోర్ట్స్ హబ్‌గా మార్చడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే మార్షల్ ఆర్ట్సలో బి.విశ్వాసరావు ఏజీ 15 వెయిట్ 65 విభాగంలో బంగారు పతకం సాధించాడు. అలాగే బి.చిరు చరణ్ తేజ ఏజీ 17 వెయిట్ 55 సిల్వర్ పతకం, బి.కృష్ణవంశీ ఏజీ 17 తైక్వాండోలో బ్లాక్‌బెల్ట్ సాధించారని కోచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి టి.అజయ్ పాల్గొన్నారు.

● జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన దినేష్ అనే క్రీడాకారుడ్ని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ అభినందించారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఢిల్లీలో నిర్వహించిన కరాటే క్రీడను ఎంపిక కావడమే కాకుండా అక్కడ దినేష్ గోల్డ్ మెడల్ సాధించాడు. కార్యక్రమంలో కరాటే శిక్షకుడు జగదీష్, రాంబాబు, డేవిడ్, ఆరీఫ్, హుశేన్ పాల్గొన్నారు.

ముస్లింలకు వడ్డీ లేని రుణాలు

● రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు


మాట్లాడుతున్న సూరి మన్సూర్ అలీఖాన్

కర్నూలు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు వడ్డీ లేని రుణాలు అందించడం అభినందనీయమని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సూరి మన్సూర్ అలీఖాన్ అన్నారు. ఆదివారం నగరంలోని ఈడెన్ గార్డెన్స్‌లో కిద్మత్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సపోర్టర్స్ మీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సొసైటీ తరపున ముస్లింకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. ఈ రుణాలు చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు రాహుల్‌గాంధీ కృషి

● లక్ష్మీనరసింహ యాదవ్ ఆధ్వర్యంలో చేరిన యువత


కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కల్లూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ జాతీయనేత రాహుల్‌గాంధీ పాటుపడుతున్నారని నంద్యాల కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జే.లక్ష్మీనరసింహాయాదవ్ అన్నారు. ఆదివారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని ఆయన నివాసంలో నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు దాసరి సుమిత్ర ఆధ్వర్యంలో నంద్యాల, పాణ్యంకు చెందిన 20 కుటుంబాలు లక్ష్మీనరసింహాయాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో అన్నపురెడ్డి ఇమ్మానియేలు, అన్నపురెడ్డి శాంతి, ఓబయ్య, దానమ్మ, చంద్రపాల్, విజయరాణి, నాగేంద్ర, దినేష్ ఉన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లు పంపిణీ

కర్నూలు రూరల్ ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం దేవమాడ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లు పంపిణీ చేసినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్‌స్వామి తెలిపారు. కర్నూలు నగరానికి చెందిన ఉపాధ్యాయుడు మాఘం శ్రీనివాసులశెట్టి భార్య పద్మావతి జ్ఞాపకార్థంగా వారి కుమారులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు మాఘం బానుప్రదీప్, మాఘం గౌతమ్ కలిసి ఆదివారం విద్యార్థులకు సరిపడ భోజన ప్లేట్లను అందజేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థుల తరపున దాతలకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

లయన్స్ క్లబ్ నూతన గవర్నర్‌కు అభినందన



లయన్స్ క్లబ్ నూతన గవర్నర్ గోపాలకృష్ణను అభినందిస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

కర్నూలు కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ నూతన గవర్నర్‌గా ఎన్నికైన గోపాలకృష్ణను లయన్స్ క్లబ్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అభినందించారు. ఆదివారం గుంతకల్లులోని వాసవి కల్యాణ మంటపంలో జరిగిన లయన్స్ క్లబ్ వివిధ జిల్లాల అధికారుల సమావేశంలో నూతన గవర్నర్ దంపతులను శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా లయన్స్ క్లబ్ సంస్థలో ఎన్నో ఏళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించి, కొత్తగా ఎంపిక చేసిన కమిటీలో అడ్వయిజర్ టు గవర్నర్ పదవికి తనను ఎంపిక చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ గౌరవాధ్యక్షుడు నాగస్వామి నాయక్, ఉపాధ్యక్షుడు కేడీజే బాబు, మెల్విన్ జోన్స్ మాజీ అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు పత్తికొండలో ధర్నా

పత్తికొండ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): క్విట్ కార్పొరేట్ నినాదంతో వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ కంపెనీల రాకకు వ్యతిరేకంగా సోమవారం పత్తికొండలో ధర్నా చేయనున్నట్లు రైతుసంఘం నాయకులు సురేంద్రకుమార్, సిద్ధలింగప్ప అన్నారు. ఆదివారం మాట్లాడుతూ ట్రంప్, మోదీ దిష్టిబొమ్మలను దహనం చేసి, నిరసన తెలపనున్నామని, బీజేపీ వచ్చాక వ్యవసాయ రంగంలో నల్లచట్టాలను తెచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు నష్టంగా మారిన మార్కెట్ చట్టాన్ని అమలులోకి తెచ్చారన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



చీరాల ఎమ్మెల్యే కొండయ్యను కలిసిన వెంకటమాధవ్

మద్దికెర ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు సమాజాభివృద్ధిలో బాగస్వాములు కావాలని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సూచించారు. మద్దికెరకు చెందిన రాష్ట్ర ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంటు అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు వెంకటమాధవ ఎమ్మెల్యేను ఆదివారం చీరాలలో కలిశారు. కళాశాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తోందన్నారు. వెంకట మాధవ్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు ముందుకు సాగుతామన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

- ఆలూరు బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసిన డీఈవో



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో

ఆలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హస్టళ్ల కోసం ప్రభుత్వం విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని డీఈవో శ్యామ్యూల్‌పాల్ సూచించారు. ఆదివారం ఆయన ఆలూరు బీసీ బాలుర హస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌ఏ-4 పరీక్షలపై విద్యార్థులతో చర్చించారు.

తీసుకున్న రుణాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సొసైటీ సీఈవో మనోహర్ నాయుడు

తుగ్గలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రుణాలు తీసుకున్న రైతులు చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని మారెళ్ల సొసైటీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సీఈవో మనోహర్ నాయుడు అన్నారు. ఆదివారం పెండేకల్ ఆర్ఎస్‌లో మాట్లాడుతూ రుణాలు చెల్లించకుండా ఉంటే మరోసారి ఇవ్వమని, బ్యాంకుల్లో కూడా రుణాలు అందవని తెలిపారు. . రైతులు వారి అకౌంట్ల ఈకేవైసీలు పూర్తి చేయాలన్నారు.

పీఆర్సీ చైర్మన్‌ను నియమించాలి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని ఎస్టీయూ జిల్లా ఆదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై మాట్లాడకపోవడం విచారకరమన్నారు.11వ వేతన సవరణ ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. 2023 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అర్బన్ ఎంఈవో, డిప్యూటీ ఈవో పోస్టులు మంజూరు చేయాలన్నారు.



మండలంలోని తంగరదోణ గ్రామం రోడ్డుపై మోకాళ్ల లోతు వర్షపునీరు నిలిచింది. నల్లరేగడి పొలాలు అధికంగా ఉన్న ఆస్పరి, నగరూరు, చిగిలి, వలగొండ, పుటకలమర్రి, ములుగుందం, చిన్నహోతూరు, జొహరాపురం గ్రామాల రోడ్లు చిత్తడిగా మారాయి. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - ఆస్పరి



పట్టణ రహదారుల్లో అడుగుకో గుంత ఉండటంతో వాహనదారులు భయం భయంగా వెళుతున్నారు. ఎమ్మిగనూరు రోడ్డు రిలయన్స్ ట్రెండ్స్ పక్కన ఎన్‌జీవో కాలనీ ప్రధాన రహదారిలో గుంతలు పడ్డాయి నిత్యం ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు ఈ దారిలోనే తిరుగుతున్నా బాగుచేయడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. - ఆదోని అగ్రికల్చర్



పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణ బురదమయంగా మారింది. వర్షపు నీరు నిలవడతో రోగులు వైద్యులు ఇబ్బంది పడుతున్నారు. రోగాలు బాగుచేసుకోవడానికి వస్తే కొత్తవి వచ్చేలా వున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని వారు కోరుతున్నారు. - ఆలూరు

అభివృద్ధికి దూరం

- పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయని ప్రభుత్వం
- హాలహర్వి మండలంలో పారిశుధ్య పనులకూ డబ్బుల్లేవు?



● ఈ చిత్రంలో మురుగుతో నిడిన రోడ్డు సిద్ధాపురం పంచాయతీ మజరా గ్రామం బల్లూరు గ్రామంలోనిది. గ్రామస్థుడి పేరు శేషన్నగౌడ్. గ్రామంలో 300 గృహాలు ఉండగా, ఏ వీధికి వెళ్లినా కంపు కొడుతూనే ఉన్నాయి. కనీసం నడిచేందుకు కూడా వీలు లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఇంత దురవస్థలు పడుతున్నా సర్పంచ్, కార్యదర్శిగానీ తమ గ్రామంవైపు ఆరు నెలల నుంచి కన్నెత్తి చూడదని గ్రామస్థులు ఆరోపిస్తు న్నారు. ఉన్నతాధికారులు స్పందింది, తమ గ్రామానికి నిధులు విడుదల చేసి, పారిశుధ్య పనులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

హాలహర్వి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో 24 గ్రామాలు, 15 పంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకపోవడంతో గ్రామ పంచాయతీలు అభివృద్ధికి దూరంగా వున్నాయి. కనీసం పారిశుధ్య పునలను కూడా చేసుకోలేని దీనస్థితికి చేరుకున్నారు. గూళ్యం, విరుపాపురం, సిద్ధాపురం, బల్లూరు, చింతకుంట, బలగోట తదితర గ్రామాల్లో ఏ వీధిలో చూసిన రోడ్లన్నీ బురదమయంతో దుర్వాసన వస్తోంది. బయటికి రావాలంటేనే జంకుతు న్నారు. తప్పని పరిస్థితి అయితే ముక్కు మూసుకుని రోడ్లను దాటాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీలకు నిధులు ఇవ్వాలి

ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు పంచాయతీకి పైసా కూడా ఇవ్వలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు రాలేకపోవడంతో సమస్యలు పరిష్కరించలేకున్నాం. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వంలోనూ మొండిచేయి మిగులుతుందని ఆందోళన చెందుతున్నాం. - **మన్మధరెడ్డి, సర్పంచ్, కొక్కరచేడు**



పారిశుధ్య పనులకు చర్యలు



పంచాయతీలకు నిధులు కొరత వాస్తవమే. 15వ ఆర్థిక సంఘం నిధులు రావాల్సి ఉంది. పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. వైద్యులతో మాట్లాడి వ్యాధులు ప్రబలకుండా చూస్తాం. - **నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో, హాలహర్వి**

'20 ఏళ్లకు ఊరికి బస్సు'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్ల అనంతరం తమ ఊరికి బస్సు వచ్చిందని, సీఎం చంద్రబాబు స్త్రీ శక్తి పథకం అమలు చేయడం, ఎమ్మెల్యే శ్యాంబాబు కృషితోమా పల్లెలకు బస్సు వేశారనీ టీడీపీ నాయకులు మెడికల్ తిమ్మప్ప, మూలింటి రంగస్వామి, నరసింహులు గౌడు, పారా రవికుమార్ అన్నారు. ఆదివారం పెరవలి గ్రామంలో మాట్లాడుతూ మండలంలోని పెరవలి, హంపా, ఎం. అగ్రహారం, ఎడవలి నాలుగు గ్రామాలకు 20 ఏళ్ల కిందట బస్సు రద్దు చేశారన్నారు. ఉచిత బస్సును తమ పల్లెలకు నడపాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్టీసీ అధికారులతో మాట్లాడారన్నారు.

అందుబాటులో ఎరువులు

తుగ్గలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు కొరత లేకుండా ఎరువులను ప్రభుత్వం అందిస్తుందని ఏవో సురేష్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఉన్నాయని, ప్రత్యేక ఎరువులు అవసరమైన వారు కోరితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తెప్పిస్తామన్నారు.

రాజేశ్వరి అమ్మ మృతి

ఆదోని టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజ రాజేశ్వరి ఆలయానికి చెందిన దేవి ఉపాసకురాలు, రాజేశ్వరీ అమ్మ(93) మృతి చెందడంతో ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యేలు మీనాక్షి నాయుడు, సాయిప్రసాద్ రెడ్డి, రాచోటి రామయ్య, నివాళి అర్పించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పట్టణ ప్రజలకు చేరువగా ఉన్నారని అన్నారు.

చంద్రబాబుతోనే ఆదోని జిల్లా

ఆదోని టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే ఆదోని జిల్లా ఏర్పాటు సాధ్యమని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ, ఆరేళ్ల క్రితమే జిల్లా ఏర్పాటు చేయాలని, జిల్లా సమితిని ఏర్పాటు చేసి, ధర్నాలు, రాస్తారోకోలు చేశామన్నారు. తమకు రాష్ట్ర అధ్యక్షుడు ఎంపి ఫరూఖ్ షూబ్లీ మద్దతు తెలిపారని గుర్తు చేసారు. నాయకులు సద్దాం హుస్సేన్, కుబేర్ స్వామి పాల్గొన్నారు.

చిత్తడి రోడ్డుపై గ్రావెల్

- హొళగుంద పోలీసుల ఔదార్యం



రోడ్డుపై గ్రావెల్ వేయిస్తున్న ఎస్ఐ గురజాల దిలీప్‌కుమార్

ఆదోని, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలను కాపాడటమే కాదు సమాజసేవలోనూ హొళగుంద పోలీసులు ముందున్నారు. వర్షాల ప్రభావంతో మండలకేంద్రంలోని బస్టాండు నుంచి వాల్మీకి సర్కిల్ రహదారి చిత్తడిగా మారి పెద్ద గుంతలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడతున్నారు. గమనించిన ఎస్ఐ గురజాల దిలీప్ కుమార్.. హొళగుందకు చెందిన వెంకటేష్ సహకారంతో రోడ్డుపై గ్రావెల్ వేసి పూడ్చించారు. దాదాపు 150 టిప్పర్ల గ్రావెల్ వేయించడతో సమస్య పరిష్కారమైంది. దీంతో ఎస్ఐ దిలీప్‌కుమార్‌ను ప్రజలు అభినందించారు. అబ్దుల్‌సుభాన్, తోక తిరుమల, ఖాదర్‌బాషా, వలీబాషా, గిరి, తుంబళం సిద్ధప్ప, బుడ్డన్న ఉన్నారు.

కూలిన ఆస్పరి - యాటకల్లు వంతెన

- రాకపోకలు బంద్



వంతెనను పరిశీలిస్తున్న గ్రామస్థులు

ఆస్పరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి యాటకల్లు రహదారిలో వంతెన ఆదివారం కూలింది. 15 రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రవాహ ఉధృతికి వంతెన కూలినట్లు గ్రామస్థులు తెలిపారు. వంతెనను బాగుచేయాలని పలుసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు.

ఏబీసీ ద్వారా సాగునీరు



మాట్లాడుతున్న నగరడోణ కిష్టప్ప

ఆలూరు(చిప్పగిరి), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆలూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా ఆలూరు, హాలహర్వి, చిప్పగిరి మండలాలకు సాగునీరు అందిస్తామని డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ నగరడోణ కిష్టప్ప అన్నారు. ఆదివారం చిప్పగిరి మండలం నగరడోణలో మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో హెచ్ఎల్సీ ద్వారా కాలువలకు నీరు పుష్కలంగా పారుతోం దన్నారు. రైతులు పంటలు సాగు చేసుకు నేందుకు అణువుగా ఉందన్నారు.

కార్యాలయం.. శిథిలం

- జొన్నగిరి ఉప్పరపల్లి సొసైటీ దుస్థితి



పెచ్చులూడుతున్న సహకార సంఘం పైకప్పు

తుగ్గలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరిలోని ఉప్పర్లపల్లి సొసైటీ కార్యాలయ భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. గత 36 ఏళ్ల క్రితం నిర్మించడం, నిర్వహణ లేకపోవడతో ఇలా తయారైంది. వర్షపు నీరు లీకేజీ అవుతుండటంతో సిబ్బంది వరండాలో పనిచేస్తున్నారు. సామగ్రి తడిసి, తుప్పు పట్టింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని సిబ్బంది కోరుతున్నారు.

ఎస్సీల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్‌ను కలిసిన శేషగిరి

ఆలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని తెలుగు యువత నాయకుడు చిన్నహ్యాట శేషగిరి కోరారు. ఆదివారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్‌ను కోడుమూరులోని స్వగృహంలో కలిసి అభినందించామన్నారు. ఎస్సీ కార్పోరేషన్ రుణాల విషయంలో చర్చించామని తెలిపారు.

చెరువును తలపిస్తున్న రహదారి



వర్షపునీటిలో ఇబ్బంది పడుతున్న వాహనదారుడు

ఆదోని, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఎస్పీ బంగ్లా సమీపంలో రోడ్డుపై వర్షపునీరు నిలిచి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. క్రాంతినగర్, కేవీబీఆర్ నగర్, కల్లుబావి కాలనీలకు చెందిన విద్యార్థులు ఈ దారిలో వెళుతుంటారు. బురదలో ఇబ్బందుడు పడుతూ వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఒంగోలులో సీపీఐ మహాసభలు

మద్దికెర ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో సీపీఐ 28వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు నాగరాజు, మదనంతపురం హనుమన్న, వ్యవసాయ సంఘం అధ్యక్షులు కోదండ రాముడు అన్నారు. ఆదివారం సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు.

ఎస్ఐను అభినందించిన నాయకులు

తుగ్గలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జునను టీడీపీ నాయకుడు బాలన్న, విద్యాకమిటి చైర్మన్ రవి, మిద్దె వెంకటేశ్ యాదవ్ అభినందించారు. ఎస్ఐ మల్లికార్జున, హెడ్ కానిస్టేబుల్ జయన్నను సన్మానించారు. ఎస్ఐ మాట్లాడుతూ అవార్డు రావడంతో బాధ్యత మరింత పెరిగిందని ప్రజలకు సేవలందించడం కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బలరాముడు, జయచంద్ర, శ్రీనివాసులు, సీతారాముడు

పాఠశాల అభివృద్ధికి తోడ్పడండి : డీఈవో

- ఆదోని, ఆలూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆలూరు బాలుర ఉన్నత పాఠశాల 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



ఆదోని నెహ్రూ స్మారక ఉన్నత పాఠశాల 1991-92 బ్యాచ్ విద్యార్థులు

ఆలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని డీఈవో శ్యామ్యూల్‌పాల్ కోరారు. ఆదివారం ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో ఆలూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1, 2లో 2000-2001 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. 25 ఏళ్ల అనంతరం తమ మిత్రులను కలిసి ఆనందంగా గడిపారు. ఆనాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఆదోని ఎంఈవో భూపాల్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, సీనియర్ అసిస్టెంట్ నరసయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు రుక్మిణి, రమణయ్య, పవన్‌కుమార్, జేమ్స్, సత్యమూర్తి, లక్ష్మన్న, నీలకంఠప్ప పాల్గొన్నారు.

33 ఏళ్ల అనంతరం కలిశారు

ఆదోని అగ్రికల్చర్: పట్టణంలోని ఎన్ఎంహెచ్ఎస్ పాఠశాల 1991-92 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 33 ఏళ్ల తర్వాత తమ స్నేహితులను చూసి ఆనందించారు. నాడు తరగతి గదిలో అల్లర్లు, మైదానంలో ఆడిన ఆటలను గుర్తు చేసుకుని సాయంత్రం వరకు అక్కడే గడిపారు. ఉపాధాయులను సన్మానించారు. అనంతరం పాఠశాలకు అవసరమైన స్టేజీను సొంత ఖర్చులతో నిర్మించి అంకితం చేశారు. నాటి ఉపాధ్యాయుడు రామకృష్ణ హెచ్ఎం ఫయాజ్, సునీల్, వరప్రసాద్‌ను సన్మానించారు. పూర్వ విద్యార్థులు మంగమ్మ, కళావతి, శ్రీను, హరి, అమర్ ప్రకాష్, కృష్ణా, ప్రకాశ్, విజయ, జమీర్, సత్య విజయహరి పాల్గొన్నారు.

నివారణ చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పొలంలో పత్తి చెట్లకు ఉన్న పత్తి కాయలు రాలిపోతున్నాయని అందుకుగాను నివారణ చర్యలు చేపట్టాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ కోరారు. ముందుగా వీటి నివారణకు పోటాషియం నైట్రేట్ 5 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. తర్వాత ప్లోనోఫిక్స్ 1 మిల్లీ లీటర్‌ను 5లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కాయలు కుళ్లు నివారణకు కాపర్ అక్సిక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేయాలని ఆయన రైతులకు సూచించారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

గోనెగండ్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా సమితి మాజీ సభ్యులు మద్దిలేటి నాయుడు, తాలుకా రైతు సంఘం అధ్యక్షుడు మాలిక్‌బాషా, సీపీఐ సహాయ కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం వారు సీపీఐ రాష్ట్ర మహాసభల గోడపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సాగునీటి కాలువలను ప్రాజెక్టులను వెంటనే ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు. ఎన్నికల హమీలో భాగంగా నిరుద్యోగ భృతి, మహిళలకు ప్రతి నెల రూ. 1500 ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అవుతున్నప్పటికీ పేదలకు మూడు సెంట్లలో ఇంటి నిర్మాణ పనులు చేపట్టలేదని వారు గుర్తు చేశారు. ఈ నెల 20 నుంచి 25వరకు ఒంగోలు నగరంలో జరగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివరామంజిని, బొబ్బిలి, బేతాళబాషా, కృష్ణ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని, నేర ప్రవర్తన కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ నేర ప్రవర్తన కలిగిన రౌడీ షీటర్లను స్టేషన్‌కు పిలిచి పట్టణ ప్రజలకు, సమాజానికి ఎటువంటి హాని జరగకుండా మెలగాలని సూచించి, నేరాలకు స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలల్లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిపారు.

మనిషికి ఆరోగ్యమే ప్రధానం


మాధవరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

మంత్రాలయం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మానవులకు అన్ని అవయవాలు సక్రమంగా పని చేస్తేనే ఆరోగ్యంగా ఉంటారని చాగలమర్రి క్రిస్టియన్ ఫెలోషిప్ హాస్పిటల్ డా.ప్రకాష్ జార్జ్ అన్నారు. ఆదివారం మండలంలోని మాధవరంలో సెయింట్ మార్థోమా మిషన్, లైట్ టూ లైఫ్ సంయుక్త ఆధ్వర్యంలో సెయింట్ థామస్ మార్తోమా హై స్కూల్‌లో ఫాదర్ జాన్ జాకబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 300 మంది రోగులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేహంలో వయస్సు పెరిగే కొద్ది రోగాలు అధికమవుతాయనీ, సమాజంలో పెరుగుతున్న కల్తీల కారణంగా దేహంలో రోగాల శాతం పెరుగుతుందని వాటిని సరిదిద్దుకోవడానికి ఆరోగ్య నియమాలు పాటించాల్సిందేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఆనంద్, రాజారత్నం, మధుకుమార్, ఆనంద్, భాగ్యమ్మ, మల్లయ్య, యాకోబు, తదితరులు పాల్గొన్నారు.

వారం రోజులుగా ఎడతెరపి లేని వర్షాలు

- పత్తి, ఉల్లి, వేరుశనగ రైతుల గగ్గోలు
- తీవ్రంగా నష్టపోతున్న ఉల్లి రైతు

కోసిగి ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి కోసిగిలో ఎడతెరపి లేకుండా వర్షాలు పడుతుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. 'వర్షాలు చాలయ్యా దేవుడా' అంటూ రైతులు చేతులెత్తి మొక్కుతున్నారు. వానల కోసం చేతులు మొక్కే రైతన్నలు వర్షం చాలయ్యో.. అంటూ ప్రార్థిస్తున్నారు. చేతికొచ్చిన పత్తి, ఉల్లి, వేరుశనగ పంటలు పూర్తిగా దెబ్బతిని దిగుబడులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉల్లి రైతులు పంటలు పీకి పది రోజులు కావస్తున్నా కోయడానికి కూడా కూలీలు రావడంలేదని లేదని, ఒకవేళ ఉల్లిగడ్డలు కోసినా అవి వర్షానికి పాడవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వేరుశనగ, పత్తి రైతులు కూడా పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని, వర్షం కొనసాగితే దిగుబడులు రాక పంటలు పూర్తిగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైద్యశాలకు తాళం వేయడం దారుణం

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో కొత్తగా నిర్మించిన 100 పడకల ఆస్పత్రి ప్రారంభమైన మూడు నెలలకే వైద్యశాలకు తాళం వేయడం దారుణమని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న పేర్కొన్నారు. పాలకులు స్పందించి ప్రతి రోజు ప్రభుత్వ వైద్యశాలను తెరచేలా చూడాలని ఆయన కోరారు.

ఈరన్న స్వామి సన్నిధిలో న్యాయాధికారులు


న్యాయాధికారులను సన్మానిస్తున్న ఆలయ అధికారులు

కౌతాళం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి వారిని ఆదివారం జిల్లా న్యాయాధికారి కబర్ధి, ఆదోని రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి సుధా, ఆదోని సబ్ న్యాయాధికారి నారాయణ దర్శించుకున్నారు. వీరికి ముందుగా ఆలయ ఈఓ వాణి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి పూలమాల, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామి శ్రావణ మాసపు ఏర్పాట్లపై ఆలయ ఈఓ వాణిని అడిగి తెలుసుకున్నారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా మెరుగైన సౌకర్యాలు అందించాలని తెలిపారు. వీరి వెంట ఆలయ ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఆలయ అధికారి వెంకటేశ్వర్లు, కౌతాళం సీఐ అశోక్ కుమార్ ఉన్నారు.

వైభవంగా వ్యాసతత్వజ్ఞతీర్థుల ఆరాధన

మంత్రాలయం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతి వ్యాసతత్వజ్ఞతీర్థుల ఆరాధనోత్సవాలు వైభవంగా జరుపుకున్నారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశిస్సులతో అక్కడి పండితుల ఆధ్వర్యంలో బృందావనాన్ని చూడముచ్చటగా అలంకరించారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 19న విజయవాడలో జరుగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియూ జిల్లా నాయకులు బాలరాజు పిలుపునిచ్చారు

పాఠశాల అభివృద్ధికి తోడ్పడండి : డీఈవో


ఆలూరు బాలుర ఉన్నత పాఠశాల 2000-01 బ్యాచ్ విద్యార్థులు

ఆలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని డీఈవో శ్యామ్యూల్‌పాల్ కోరారు. ఆదివారం ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో ఆలూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1, 2లో 2000-2001 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. 25 ఏళ్ల అంనతరం తమ మిత్రులను కలిసి ఆనందంగా గడిపారు. ఆనాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఆదోని ఎంఈవో భూపాల్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, సీనియర్ అసిస్టెంట్ నరసయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు రుక్మిణి, రమణయ్య, పవన్‌కుమార్, జేమ్స్, సత్యమూర్తి, లక్ష్మన్న, నీలకంఠప్ప పాల్గొన్నారు.

33 ఏళ్ల అనంతరం కలిశారు

ఆదోని అగ్రికల్చర్: పట్టణంలోని ఎన్ఎంహెచ్ఎస్ పాఠశాల 1991-92 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 33 ఏళ్ల తర్వాత తమ స్నేహితులను చూసి ఆనందించారు. నాడు తరగతి గదిలో అల్లర్లు, మైదానంలో ఆడిన ఆటలను గుర్తు చేసుకుని సాయంత్రం వరకు అక్కడే గడిపారు. ఉపాధాయులను సన్మానించారు. అనంతరం పాఠశాలకు అవసరమైన స్టేజీను సొంత ఖర్చులతో నిర్మించి అంకితం చేశారు. నాటి ఉపాధ్యాయుడు రామకృష్ణ హెచ్ఎం ఫయాజ్, సునీల్, వరప్రసాద్‌ను సన్మానించారు. పూర్వ విద్యార్థులు మంగమ్మ, కళావతి, శ్రీను, హరి, అమర్ ప్రకాష్, కృష్ణా, ప్రకా' విజయ, జమీర్, సత్య విజయహరి పాల్గొన్నారు.

'జీవోను ఉపసంహరించుకోవాలి'

కర్నూలు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు బయటకు రాకుండా ఉండేందుకే పాఠశాలల్లోకి ప్రజా సంఘాల ప్రవేశాన్ని నిషేధించారని, ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పాఠశాలల ఆవరణలోకి విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం రద్దు చేసుకోవాలని కోరారు. విద్యార్థుల సమస్యలు బయటకు రాకుండదనే కుట్రతోనే ప్రభుత్వం ఇలాంటి నియంతృత్వ పోకడలతో ఆదేశాలు జారీ చేసిందన్నారు. గతంలో విద్యార్థి సంఘాలను సమస్యపై పోరాడంటి అంటూ నారా లోకేశ్ ప్రోత్సహించి అధికారంలోకి వచ్చాక నియంతృత్వ ధోరణి అవలంబించం సరైన పద్ధతి కాదన్నారు. సమావేశంలో మహిళా ఐక్యవేదిక రాయలసీమ డివిజన్ అధ్యక్షురాలు ఆడిగ భారతమ్మ, జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ, జిల్లా ఉపాధ్యక్షురాలు హుస్సేన్ బీ, ఎలిశమ్మ, ఖాసింబీ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 19న విజయవాడలో జరుగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియూ జిల్లా నాయకులు బాలరాజు పిలుపునిచ్చారు

ముస్లింలకు వడ్డీ లేని రుణాలు

కర్నూలు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు వడ్డీ లేని రుణాలు అందించడం అభినందనీయమని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సూరి మన్సూర్ అలీఖాన్ అన్నారు. ఆదివారం నగరంలోని ఈడెన్ గార్డెన్స్‌లో కిద్మత్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ అధ్వర్యంలో నిర్వహించిన సపోర్టర్స్ మీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సొసైటీ తరపున ముస్లింకు వడ్డి లేని రుణాలు ఇవ్వడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. ఈ రుణాలు చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.

అధ్వానంగా ..రోడ్లు

- గోనెగండ్ల శివారు ప్రాంతాలలో రోడ్ల పరిస్థితి దారుణం
- రాకపోకలకు ఇబ్బందిపడుతున్న కాలనీ వాసులు


ఉప్పరివీధి రోడ్డు దుస్థితి


దొనబండవీధి రోడ్డులో నిలిచిన వర్షంపునీరు

గోనెగండ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన గోనెగండ్లలో చిన్నపాటి వర్షం కురిసిందంటే చాలు శివార్లు ప్రాంతాలలోని కాలనీల రహదారులు బురదమయంగా మారిపోతుండడంతో అడుగుతీసి అడుగు వేయడానికి కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామా శివారు ప్రాంతాలైన చాకలివీధి, దొనబండవీధి, ఉప్పరవీధి, గంజహళ్లి రోడ్డు నుంచి కేజీబీవీ పాఠశాలకు వెళ్లే రహదారులు చిత్తడిగా మారిపోతున్నాయి. సీసీ రోడ్డు లేక పోవటం అలాగే డ్రైనేజి వ్యవస్థ లేక పోవటంతో వర్షంపునీరు మురుగునీరు అంతా కలసి పోయి రోడ్డు బురదగా మారి గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షం వచ్చినప్పుడల్లా నీరు చేరి గుంతులు మరింత పెద్దవిగా మారిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ కాలనీలకు సీసీరోడ్డు, డ్రైనేజి ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

వెండి రథంపై ప్రహ్లాదరాయలు


వెండి రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రీ మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం శ్రావణ బహుళ నవమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు,ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. స్త్రీశక్తి బస్సు ఫ్రీ చార్జీ, ఆదివారం సెలవు దినం కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులు పొందారు.

ఆశ్రమానికి సహకరిస్తాం


పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అశ్రమ చిన్నారులతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పూలే అంబేడ్కర్ ఎడ్యూకేషనల్ సొసైటీ అశ్రమానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనిలో ఉన్న పూలే అంబేడ్కర్ ఎడ్యూకేషనల్ సొసైటీ ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారుల వివరాలు, వారికి అందుతున్న వసతులు వంటి వివరాలను నిర్వాహకులు నరసన్న, ప్రతిభా భారతిని అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మా నాన్న వృద్ధాశ్రమానికి స్థలం కేటాయించాలని, అలాగే ఆశ్రమ నిర్వహణ కు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందేలా చూడాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తు ఆశ్రమానికి అన్ని విధాల అండదండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షులు డా. మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ మల్లయ్య, నాయకులు కాశీం వలి, జగదీష్, గోపాల్, వెంకటేష్, సొసైటీ సభ్యులు ప్రసాద్, యువరాజు పాల్గొన్నారు.

కార్యకర్తలను పరామర్శించిన ఎమ్మెల్యే బీవీ


కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

నందవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నందవరం మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి తనయుడు రైస్‌మిల్ నారాయణరెడ్డి గుండెపోటుకు గురై చికిత్స చేయించుకుని ఇంటికి రావడంతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే మండలంలో గురుజాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చార్లేష్‌కు కూడా గుండె అపరేషన్ జరగడంతో ఆయన ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే బీవీ పరామర్శించారు. అలాగే నందవరంలోని టీడీపీ నాయకుడు వడ్డే గోపాల్ నూతన గృహప్రవేశానికి వెళ్లారు. అయనతో పాటు టీడీపీ నాయకులు దేశాయి మాదవరావు, ఈరన్నగౌడు, నాగరాజుగౌడు, కాశీంవలీ, దర్మాపురం గోపాల్ పాల్గొన్నారు

బైక్‌ను ఢీకొన్న వాహనం

కోసిగి ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామానికి చెందిన హరిజన నరేష్ ఆదివారం కందుకూరు గ్రామానికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా.. ఎదురుగా వస్తున్న వాహనం ఢీ కొనడంతో హరిజన నరేష్ తలకు, చేతులకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు కోసిగి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బంధువులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆదోని అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జిగా దయాసాగర్

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఎమ్మిగనూరు నియోజకవర్గానికి ఇంచార్జిగా బీజేపి జిల్లా కార్యదర్శి (కౌన్సిలర్) దయాసాగర్ నియమితులయ్యారు.. ఎమ్మిగనూరు పట్టణ అధ్యక్షుడిగా జట్టెప్ప, ఎమ్మిగనూరు రూరల్ అధ్యక్షుడిగా యు వెంకటేష్‌లను నియమించారని తెలిపారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్ని అన్నారు.

సరైన వైద్యం అందించాలి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో కొత్తగా నిర్మించిన 100 పడకల ఆస్పత్రిలో రోగులకు సరైన వైద్యం అందజేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, గోనెగండ్ల, పెద్దకడబూరు మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు ప్రభుత్వ వైద్యశాలకు వస్తుంటారన్నారు. అయితే ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుల నిర్లక్ష్యంతో రోగులకు వైద్యసేవలు సక్రమంగా అందడంలేదన్నారు. 24 గంటల పాటు అందుబాటులో ఉండాల్సిన వైద్యశాలను వైద్యుల నిర్లక్ష్యంతో తాళాలు వేసి రోగుల కష్టాలను గాలికి వదిలేస్తున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు, పాలకులు స్పందించి ప్రతి రోజూ ప్రభుత్వ వైద్యశాలఅందుబాటులో ఉండేలా చూడాలని ఆయన కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మిరప నారకు తగ్గిన గిరాకీ..

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో రైతులు ప్రతియేటా పత్తి తర్వాత అధికంగా సాగు చేసే పంట మిరప. అయితే ఈ ఏడాది జిల్లాలో పత్తిపంటపై రైతన్నలు ఆసక్తి కనబరిచారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా తెల్లబంగారం పంటే దర్శనమిస్తుంది. దీంతో ఈ ఏడాది జిల్లాలో మిరప పంట సాగు తగ్గే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు.


గిరాకీ.. తగ్గింది: ఈ ఏడాది మిరప పంటకు గిరాకి తగ్గిందనే చెప్పాలి. జిల్లాలో గతేడాది రైతన్నలు దాదాపు 36,228 హెక్టార్లలో మిరప పంటను సాగు చేశారు. అయితే పంటచేతికొచ్చే సమయానికి మిరప ధర పడిపోవడంతో రైతన్నలు ఈ ఏడాది మిరప సాగుపై ఆసక్తి చూపలేదు. అంతేగాక మిరప పంటకు పెట్టుబడి ఎక్కువ అవుతుండడం, పత్తి పంటకు పెట్టుబడి తక్కువ కావడం.. ప్రభుత్వం పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తుండడంతో ఈ ఏడాది అధిక శాతం మంది రైతన్నలు పత్తిపంట సాగుపైనే ఎక్కువగా మొగ్గుచూపారు. దీంతో ఈ ఏడాది మిరప నారకు గిరాకీ తగ్గిందని వ్యవసాయ నిపుణులు తెలుపుతున్నారు.

తగ్గనున్న మిరప సాగు:జిల్లాలో గతేడాది ఆగస్టు నెలకంత దాదాపు 25శాతం మంది రైతన్నలు మిరప పంటను సాగుచేశారు.


ఎమ్మిగనూరులో సాగవుతున్న మిరప నారు

అయితే ఈ ఏడాది ఆ సంఖ్య కాస్తా పూర్తిగా తగ్గింది. ఇప్పటి వరకు జిల్లాలో దాదాపు కేవలం5వేలకు తక్కువ హెక్టార్లలో మాత్రమే మిరప పంటను రైతన్నలు సాగుచేశారు. గతేడాది కంటే ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా దాదాపు 10వేల హెక్టార్లలో మిరప పంట సాగుతగ్గే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

200 ఎకరాల మిరప విక్రయించేవాళ్ళం



ప్రతియేటా ఆగస్టునెల 10వ తేదీ వరకు దాదాపు 200 ఎకరాల వరకు మిరపనారను విక్రయించేవాళం. దాదాపుగా మొత్తం 1000 ఎకరాలకు మిరప నారను విక్రయించేవాడిని. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక్క ఎకరాకు కూడా రైతులు మా దగ్గర మిరప నారను తీసుకెళ్లలేదు. దీన్ని బట్టి చూస్తే ఈ ఏడాది మిరప పంట సాగు పూర్తిగా తగ్గేలా కనిపిస్తుంది.

మురళీకృష్ణారెడ్డి, కే.వీరెడ్డి, నర్సరీ యజమాని, రాళ్లదొడ్డి.

10వేల హెక్టర్ల వరకు సాగు తగ్గవచ్చు



జిల్లాలో వ్యాప్తంగా ఈ ఏడాది దాదాపు 10వేల హెక్టార్ల వరకు మిరప సాగు తగ్గే అవకాశం ఉంది. ఇందుకు ప్రధాన కారణం రైతన్నలు అధికంగా పత్తిపంటను సాగుచేయడమే. సెప్టెంబరు చివరి వరకు మిరప పంటను రైతన్నలు సాగు చేస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా కేవలం 5,500 హెక్టార్లలో మాత్రమే రైతన్నలు మిరపను సాగుచేశారు.

- డాక్టర్ రాఘవేంద్ర చౌదరి, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

ఎమ్మిగనూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పవర్ లిఫ్టింగ్ పోటీలకు జాతీయ స్థాయిలో ఎంపికైన పట్టణానికి చెందిన మహ్మద్ వలికి టీడీపీ నాయకులు మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. ఆర్థికసాయం అందించారు. మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు విద్యార్థి మహ్మద్ వలిని అభినందించి ఈ సందర్భంగా ఆల్‌ఫ్రెడ్ రాజు మాట్లాడుతూ పేద క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తాన న్నారు. జాతీయస్థాయిలో ఆడేందుకు ఎమ్మిగనూరు విద్యార్థి ఎంపిక కావటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఈటీలు వెంకటేష్, వసంతరాజు, నరసింహరాజు పాల్గొన్నారు.